క్లుప్తంగా

క్రీడా సాధనతో ఆరోగ్యం



బెల్ట్‌లు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యం కోసం క్రీడల్లో సాధన చేయాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన యూనివర్సల్ బుడోకాన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ వల్ల శరీరం ఫిట్‌గా ఉంటుందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. నిత్య జీవితంలో ఉల్లాసంగా ఉండేందుకు చిన్నారులు మార్షల్‌ఆర్ట్స్‌లో రాణించాలని సూచించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు బెల్ట్‌లను, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కరాటే శిక్షకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ



మంత్రి టీజీ భరత్‌కు పూలమొక్కను అందిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం ఉదయం సంకల్‌భాగ్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి పూల మొక్కను అందజేశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై ఇరువురు చర్చించారు.

నేడు అక్షరాభ్యాస మహోత్సవం



నన్నూరులో వెలసిన సరస్వతీ దేవి

కర్నూలు కల్చరల్: వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం నన్నూరు సమీపం రాగమయూరిలోని సరస్వతీ దేవి ఆలయంలో అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీ విద్యా సుందర సరస్వతి పీఠం పీఠాధిపతి యశోదకుమార శర్మ తెలిపారు. గత 16 సంవత్సరాల నుంచి వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకం, ఉదయం 8 గంటల నుంచి సరస్వతీ దేవి అష్టోత్తర పూజ, బీజాక్షరాలతో సామూహిక అక్షరాభ్యాసం, సరస్వతి హోమాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

వక్ఫ్ చట్ట సవరణను విరమించుకోవాలి



ధర్నా చేస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్‌ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గడియారం ఆసుపత్రి ఎదుట వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో మైనార్టీలపై దాడులు జరుగుతుంటే పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం వారి ఆస్తులపై కన్నేయడం అన్యాయమన్నారు. వక్ఫ్ ఆస్తుల గురించి బీజేపీకి ఎందుకని ప్రశ్నించారు. వక్ఫ్ ఆస్తులను ఆయా సంస్థలు సక్రమంగా నిర్వహించుకోగలవన్నారు. వెంటనే వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. నాయకులు మహబూబ్‌బాషా, ఖాజాపాషా, సలీం పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్డు ఛిద్రం



చిన్నటేకూరులో దెబ్బతిన్న రోడ్డు

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై నిత్యం భారీ వాహనాలు అధిక లోడ్డుతో తిరుగుతుండడంతో రోడ్డు ఛిద్రమవుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఛిద్రమైన దగ్గర ఎదురెదురుగా వాహనాలు వస్తే కొంత సమయం ట్రాఫిక్ అంతరం ఏర్పడుతోందని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

జ్ఞాన స్వరూపిణి సరస్వతీ

● ఘనంగా వసంత పంచమి వేడుకలు ● ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసాలు



విజ్ఞాన పీఠంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



లలితా పీఠంలో పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



లలితా పీఠంలో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో రాజశ్యామలా దేవి



విజ్ఞాన పీఠంలో సరస్వతీ దేవి

కర్నూలు కల్చరల్: జిల్లాలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. కర్నూలు నగరంలోని గో సంరక్షణ శాల, ఓల్డ్ సిటీలోని లలితా పీఠం, సంకల్‌భాగ్ హరిహర క్షేత్రం, సూర్యనారాయణ స్వామి ఆలయం, రాజరాజేశ్వరీ దేవి ఆలయం, పలు విద్యా సంస్థల్లో ఆదివారం మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకొని జ్ఞాన స్వరూపిణి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకం, సర్వసతి హోమాలు, సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. లలితా పీఠంలో పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

నగర శివారులోని విజ్ఞాన పీఠం పాఠశాలలో భక్తి శ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు జరిగాయి. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కరస్పాండెంట్ గురుమూర్తి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



వైద్య సేవలను పరిశీలిస్తున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం అంధకారం తప్పదని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. బాలసాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఆదివారం స్థానిక షరీన్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి బీపీ, షుగర్, కంటి పరీక్షలను నిర్వహించారు. కంటి వైద్యనిపుణులు డాక్టర్ జయప్రకాష్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. గ్లకోమా, మయోపియా, కాటరాక్ట్ వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. వైద్య బృందం, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు చంద్రబాబు కుట్ర



కరపత్రాలను విడుదల చేస్తున్న మాల జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మాల జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా, క్రిమిలేయర్‌ను రద్దు చేయాలనే పలు డిమాండ్లపై ఈ నెల 23వ తేదీన స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో జరగనున్న రాయలసీమ 'మాలల యుద్ధ గర్జన' భారీ బహిరంగ సభకు సంబంధించి జేఏసీ నేతలు సన్నాహక సమావేశం నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ యాట ఓబులేష్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ ఎస్.నాగప్ప వీధి చెన్నకేశవ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి గోన నాగరాజు, దామోదరం రాధాకృష్ణ, కే.మాధవస్వామితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. మాలల యుద్ధ గర్జనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నేతలు మాట్లాడుతూ.. మాల మాదిగలను విడగొట్టాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో తప్పుడు సర్వేలు చేయిస్తున్నారన్నారు. మాలలను అణచివేసేందుకు టీడీపీ, బీజేపీ పన్ను తున్న కుట్రలను మాలలు తిప్పి కొడతారన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ కాకుండా, సుప్రీంకోర్టు తీర్పు కేవలం గైడ్‌లైన్స్ మాత్రమేనని, జడ్జిమెంట్ కాదన్నారు. ఎస్సీ కులగణన చేసి 23 శాతం రిజర్వేషన్ పెంచాలనే డిమాండ్లపై జరగనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు లక్షలాదిగా మాలలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం ముందు గర్జనను విజయవంతం చేయా లని నినాదాలు చేశారు. నాయకులు ఎలీషా, శీలం శేషు, వేల్పుల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నగరపాలకలో నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు స్థానిక సమస్యలపై ఫిర్యాదుల రూపంలో కార్యాలయంలో అందజేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.

గోకారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం



గోకారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా మాజీ కార్యదర్శి పెద్దింటి గోకారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం గోకారి నగర్‌లో ఆయన 10వ వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టి పెత్తందార్లపై తిరగబడిన నేత అని కొనియాడారు. ఆనాడు ప్రభుత్వం పోరాటాల కోసం వార్డు కౌన్సిలర్ పదవిని త్యాగం చేశారన్నారు. బిర్లా కంపెనీలో కూలీల కోసం తిరగబడి యాజమాన్యం మెడలు వంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. శ్రీశైలం, సున్నిపెంట చెంచుల అభివృద్ధి కోసం కృషిచేశారని, వారి సమస్యల కోసం అప్పటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావును నంద్యాలలో అడ్డుకొని జైలుకు వెళ్లారన్నారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం గడిపి పేదల కోసం ప్రశ్నించారన్నారు. నాయకులు మౌలాబీ, ఎల్లమ్మ, బ్రహ్మయ్య, రవి, ప్రసాదు పాల్గొన్నారు.

● పూదోట కాదు.. పొగాకు పంట



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏదైనా పూల తోట అయి ఉంటుందనుకుంటే పొరపాటే. ఇది పొగాకు పంట. మండల పరిధిలోని బస్తిపాడు,లక్ష్మీపురం, బొల్లవరం, పుసులూరు, రెమడూరు తదితర గ్రామాల్లో సాగు చేసిన పొగాకు పైర్లు పూలతో నిండి రోడ్డుపైనుంచి చూస్తే పూదోటలను తలపిస్తున్నాయి. పాదచారులు, ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. – కల్లూరు

పద్మశాలీలు అన్నిరంగాల్లో ఎదగాలి



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలి ఇంజినీరింగ్ సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ: పద్మశాలీలు అన్ని రంగాలలో ఎదిగేలా ఐక్యంగా పోరాడాలని పద్మశాలీ ఇంజినీరింగ్ సంఘం ప్రెసిడెంట్ నారాయణ కేశవయ్య సూచించారు. ఆదివారం బిర్లా కాంపౌండ్ బాలాజీ బిల్డర్స్ కార్యాలయంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. పద్మశాలి ఇంజినీరింగ్ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీల పిల్లలు ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగలలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సమస్యలను పరిష్కరించుకోవడానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. సంఘం కార్యదర్శి కోడి రామకృష్ణ, ట్రెజరర్ గుంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి

కర్నూలు న్యూసిటీ: టీడీపీ వ్యవస్థాపకుడు కళాకారుడు కావడంతో పార్టీలో కళాకారులకు సముచిత స్థానం ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో గజ్జపూజ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు, కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గౌరు చరిత మాట్లాడుతూ.. కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కళాకారుల కోసం కళా వేదిక ఏర్పాటుకు హామీ ఇచ్చారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. చిన్నారులకు విద్యతో పాటు సాంస్కృతిక రంగంలో ప్రవేశం ఉంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ప్రభుత్వ శారద సంగీత కళాశాల అధ్యాపకుడు నాగసాయి ప్రదీప్ కిరణ్, లెక్చరర్ పార్వతి, వైద్యురాలు అమృతసాయి తదితరులు పాల్గొన్నారు.

గుండెజబ్బులపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెజబ్బుల నిర్ధారణకు ప్రస్తుతం అనేక వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయన్నారు. చాలా మంది ఈ జబ్బులను నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రమాదం ముంచుకొచ్చేంత వరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ అనంతరం గుండెజబ్బులతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఆహార, విహారాల్లో విపరీత మార్పులు వచ్చాయన్నారు. అధికంగా కొవ్వు పదార్థాలు, జంక్‌ఫుడ్, తీపి పదార్థాలు తీసుకోవడం వల్ల ఊబకాయుల సంఖ్య పెరుగుతోందని, దీనికి తోడు వ్యాయామం చేసే వారి సంఖ్య కూడా తక్కువగా ఉందన్నారు. ఈ కారణంగానే గుండెజబ్బులతో బాధపడే వారి సంఖ్య పెరిగిందన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు వ్యాయామం పట్ల అవగాహన కల్పించాలని, ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. వాకింగ్ లేదా స్విమ్మింగ్, జిమ్, యోగా చేయవచ్చన్నారు. ఆహారంలో మార్పులు చేసుకోవడం, ధూమ, మద్యపానాలు మానేయడం చేయాలన్నారు. మధ్య వయస్సుకు వచ్చిన వారు ఏడాదికి ఒకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన్ను హార్ట్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, కల్యూకర చంద్రశేఖర్, ట్రెజరర్ రాముడు, వాసుదేవరావు, పాపారావు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూసీఈ భవన నిర్మాణం ప్రారంభించాలి



ఆర్‌యూసీఈ భవన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ బృందం

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఆర్‌యూసీఈ) భవనాల నిర్మాణ పనులను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ, పీఎస్ఎన్ కన్వీనర్ అమర్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ బృందం జగన్నాథగట్టు సమీపంలోని ఆర్‌యూ స్థలాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌యూసీఈ భవనాల నిర్మాణాలకు ఐదేళ్ల క్రితమే రూ.10 కోట్ల నిధులు మంజూరైనా నిర్మాణాల్లో పురోగతి లేదన్నారు. పునాదులు మాత్రమే వేసి నిర్మాణాలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వర్సిటీ స్థలాలు అన్యాక్రాంతమయ్యే ముప్పు ఉందని వాపోయారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వర్సిటీ స్థలానికి కంచె ఏర్పాటు చేయాలని, వర్సిటీ అధికారులు ఇంజినీరింగ్ కళాశాల భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. ఎస్ఎఫ్ఐ, పీఎస్ఎన్ నాయకులు రాజు, హర్ష, శంకర్, జితేంద్ర, తరుణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని హెచ్‌డీసీటీ హాస్పిటల్‌లో సేవా భారతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి చెప్పారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసి సూచనలు, సలహాలు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ సి.వాసురెడ్డి మాట్లాడుతూ.. వైద్యసేవలతో పాటు ఆసుపత్రికి వచ్చిన వారికి ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. సేవా భారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగం శ్రీనివాసులు, న్యూరోసర్జన్ డబ్ల్యూ సీతారాం, డాక్టర్లు అనంత్, సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరమణ, ఇందిర, నిర్వాహకులు దిలీప్, అమిత్, నలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు పోరును విజయవంతం చేయండి



ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదిమూలపు సతీష్, విద్యార్థి నాయకులు

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ పిలుపు

కర్నూలు(రూరల్): విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5వ తేదీ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ఫీజు పోరును విజయవంతం చేయాలని ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. ఆదివారం తన కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులపై కక్ష కట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా దీవెనకు రూ.2,800 కోట్లు, వసతి దీవెనకు రూ.1,100 కోట్లు మొత్తం రూ.3,900 కోట్లు విద్యాసంస్థలకు చెల్లించాల్సి ఉందన్నారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, పార్టీ కర్నూలు మండల కన్వీనర్ మోహన్‌బాబు, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, మణిరెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయంపై నిరసన



సుందరయ్య సర్కిల్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం న్యూసిటీ కమిటీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేయడంపై సీపీఎం మండిపడింది. కేంద్ర ప్రభుత్వ తీరునకు వ్యతిరేకంగా ఆదివారం పలు చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.నరసింహులు, సాయిబాబా, సుధాకరప్ప మాట్లాడుతూ.. నిధులను రాబట్టడంలో సీఎం చంద్రబాబునాయుడు విఫలమయ్యారన్నారు. పోలవరం సవరించిన అంచనాలకు అనుగుణంగా ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు కుదించడం అన్యాయమన్నారు. విశాఖ స్టీలు ప్లాంటుకు రూ.11,400 కోట్లు ఇస్తామని చెప్పిన కేంద్రం బడ్జెట్‌లో మాత్రం రూ.5 వేల కోట్లను కూడా కేటాయించలేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ లేదని, విశాఖ రైల్వే జోన్, కడప స్టీలు ప్లాంట్‌కు నిధులు కేటాయించకపోవడం అన్యాయమని వాపోయారు. ఓర్వకల్ ఎయిర్‌పోర్టు, ఇండస్ట్రియల్ హబ్‌కు నిధులు లేకపోవడంతో ముందుకు కదిలే పరిస్థితులు లేవన్నారు. నాయకులు శంకర్, భాస్కర్, ఏసు, చిన్న ఆనంద్, రామకృష్ణ, చలపతి, శ్రీనివాసులు, రాఘవేంద్ర, రాగప్ప పాల్గొన్నారు.

వీకర్ సెక్షన్ కాలనీలో...

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని సీపీఎం నాయకురాలు శ్యామలమ్మ విమర్శించారు. ఆదివారం వీకర్‌సెక్షన్ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఏపీకి ప్రత్యేక హోదా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణం కోసం నిధులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యకరమంలో వలి, సూరి, రవి పాల్గొన్నారు.

ఓల్డ్‌సిటీ కమిటీ ఆధ్వర్యంలో....

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సీపీఎం ఓల్డ్‌సిటీ కమిటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎస్‌డీ ఖాజా మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన హామీలకు నిధులు కేటాయించలేదన్నారు. మోదీ, అమిత్‌షా ఏపీకి చేటుగా మారారని విమర్శించారు. కర్నూలు జిల్లాకు సంబంధించి రైల్వే ప్రాజెక్టులకు నిధులు లేకపోవడం దారుణమన్నారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు లేకపోవడంతో అభివృద్ధి జరిగే అవకాశం లేదన్నారు. నాయకులు మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, రమేష్, బాబు పాల్గొన్నారు.

బీమారంగంలో వంద శాతం ఎఫ్‌డీఐలు ప్రమాదకరం

కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగంలో నూరు శాతం ఎఫ్‌డీఐలకు ఆమోదం తెలపడం ప్రమాదకరమని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి సునీల్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగ సంఘం వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం బిల్లు తెస్తే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

అంకెల గారడీగా కేంద్ర బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌ను చూస్తే అంకెల గారడీగా అర్థమవుతుందని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా రైతులు, పేదలకు ప్రయోజనం లేనిదని, దీన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగినా సీఎం చంద్రబాబునాయుడు స్పందించకపోవడం అన్యాయమన్నారు. కూటమి నేతలకు రాష్ట్ర ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలే ఎక్కువని, అందుకే కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను సైతం బాగుందని ప్రశంసిస్తున్నారని దుయ్యబట్టారు.

కార్పొరేట్‌లకు ఊడిగం చేసే బడ్జెట్

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌లకు ఊడిగం చేసేలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ బడ్జెట్‌లో చేతి వృత్తిదారులకు తీవ్ర అన్యాయం జరిగిందని, 2024లో చేతివృత్తులను ప్రోత్సహించడం కోసం కేంద్రం పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టినా దానికి నిధులు కేటాయించలేదన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులకు కోత పెట్టారని, అవసరమైన వృత్తి నైపుణ్యం, ఉపాధి కల్పించడం వంటి సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున నిధులకు కోత పెట్టారన్నారు. సామాన్యుల నడ్డి విరిచి కార్పొరేట్లకు తివాచీ పరచారని విమర్శించారు.